నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 11 జూన్ 2025 | KAMAREDDY

# గోదావరి పరవళ్లు

## త్రివేణి సంగమంలోకి కొత్తనీరు



రెంజల్, జూన్ 10 : రెండుమూడు రోజులుగా కరుస్తున్న వర్షాలకు మండలంలోని కందకుర్తి సమీపంలో ఉన్న త్రివేణి సంగమంలోకి కొత్తనీరు వచ్చి చేరుతున్నది. పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి వరద రావడంతో ఇప్పటివరకు నీరులేక వెలవెల బోయిన గోదారమ్మ ప్రస్తుతం పరవళ్లు తొక్కుతున్నది. దీంతో గోదావరి పరీవాహక ప్రాంతం జలకళ సంతరించుకుంటున్నది. కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిలో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు చెబుతున్నారు. నదిలో కొత్త నీరు చేరడంతో భక్తులు, సందర్శకులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

# అక్రమ కేసులు, వేధింపులకు భయపడేదే లేదు..

- రేవంత్ కక్ష సాధింపులో భాగమే కేసీఆర్‌కు నోటీసులు
- ఆయనను ప్రత్యక్షంగా ఎదుర్కోలేకనే కాంగ్రెస్, బీజేపీ కుట్రలు
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



మోర్తాడ్, జూన్ 10: రేవంత్‌రెడ్డి కక్ష సాధింపులో భాగంగానే కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇచ్చిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ చట్టాన్ని గౌరవించి విచారణకు హాజరవుతున్నారని, ఆయనను ప్రత్యక్షంగా ఎదుర్కొనలేకనే నోటీసుల పేరుతో కాంగ్రెస్, బీజేపీలు కూడబలుక్కొని ఇబ్బందులు పెట్టాలని కుట్రలు చేస్తున్నాయని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆరోపించారు. సబ్బండ వర్ణాలను కలుపుకుని సుదీర్ఘపోరాటం చేసి తెచ్చిన తెలంగాణను దేశంలో అగ్రగామిగా నిలపడానికి కేసీఆర్ పదేండ్లు అహో రాత్రులు కృషి చేశారని పేర్కొన్నారు. తెలంగాణ బాగును కాంక్షించిన కేసీఆర్‌పై విచారణ పేరిట వేధింపులకు గురి చేయాలని కాంగ్రెస్ చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ వెంట తెలంగాణ సమాజం ఉన్నదని, కుట్రలను ఛేదించి ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌పార్టీని దోషిగా నిలబెడుతామని, ప్రజాకోర్టులో శిక్షిస్తామని హెచ్చరించారు.

**ప్రజలకు శాపంగా మారిన కాంగ్రెస్ పాలన**

'నేను టీడీపీ స్కూల్‌లో, బీజేపీ కాలేజీలో చదివాను, రాహుల్‌గాంధీ దగ్గర ఉద్యోగం చేస్తున్నా..' అంటున్న రేవంత్‌రెడ్డి.. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల అమలు విషయంలో ఉద్యోగ ధర్మంలో విఫలమవ్వడంతో 45 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టినా రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. మొన్నటి వరకు విద్యుత్‌పై కమిషన్ వేసి కేసీఆర్‌ను, ఫార్ములా– 1 లో విచారణ పేరిట కేటీఆర్‌ను, అలాగే పార్టీ నాయకులను ఏ అవకాశం దొరికినా కక్ష సాధిస్తూ ఇబ్బందులు పెట్టాలని కాంగ్రెస్ పార్టీ చూస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 18నెలలకే కాంగ్రెస్ పాలన తెలంగాణకు శాపంగా మారిందని ప్రజలు అనుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టే కేసులు, విచారణకు భయపడేదిలేదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ధైర్యంగా ఎదుర్కొన్నామని, ఇక ముందు కూడాఎదుర్కొంటామని పేర్కొన్నారు. కుట్రలను ఛేదిస్తూనే కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు పోరాడుతామని వేముల స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌లో పదవుల చిచ్చు !

- పీసీసీ కార్యవర్గ జాబితాపై అసంతృప్తి సెగలు
- నిజామాబాద్ జిల్లాలో ఒకరిద్దరికే పట్టం కట్టిన వైనం
- పీసీసీ చీఫ్ ఇలాఖాలో ఉమ్మడి జిల్లాకు దక్కని ప్రాధాన్యం
- కామారెడ్డిలో రసవత్తరంగా మారిన పదవుల పందేరం
- పార్టీ పెద్దలపై రుసరుసలాడుతున్న ద్వితీయ శ్రేణి నాయకత్వం
- పార్టీ వీడాలని చర్చించుకుంటున్న పలువురు కీలక నేతలు



బోధన్ పట్టణం బసవతారక్‌నగర్‌లోని వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ యువ నాయకులు

నిజామాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అధికార కాంగ్రెస్ పార్టీలో పదవుల పంపకం చిచ్చు రేపుతున్నది. బజారున పడి పదవుల కోసం కొట్లాడుకునే దుస్థితికి వచ్చింది. పార్టీలో నువ్వా నేనా అన్నట్లుగా పలువురు నేతలు బహిరంగంగానే వ్యాఖ్యలు చేసుకుంటున్నారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణతో కాంగ్రెస్ పార్టీలో అంటుకున్న అసంతృప్తి సెగ.. ఇప్పుడు పీసీసీ కార్యవర్గం కూర్పుతో మరింత పెరిగింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పదవుల సెగ రోజు రోజుకూ ఎక్కువ అవుతోంది. క్యాబినెట్‌లో బెర్త్ దక్కకపోవడంతో ఇప్పటికే బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అధిష్టానం తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. బోధన్ నియోజకవర్గంలోని ఆయన అనుచరులు ఒక అడుగు ముందుకేసి రాజీనామా అస్త్రాలను సంధించారు. మంత్రి పదవి ఇవ్వాలంటూ మంగళవారం వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన కూడా తెలిపారు. సోమవారం విడుదల చేసిన పీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల నియామకాల్లోనూ పలువురు నేతలకు మొండి చేయి దక్కడంతో సీనియర్లు గుర్రుమంటున్నారు. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని పని చేస్తున్న వారిని కాదని ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పదవులు కట్టబెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఇలాఖాలోనూ విభిన్నమైన పరిస్థితి దాపురించడం గమనార్హం. నిజామాబాద్ జిల్లాకు ఒకరిద్దరు మినహా సీనియర్ నాయకులెవరికీ పీసీసీ కార్యవర్గంలో పదవుల్లేవు. జిల్లా నుంచి పీసీసీ అధ్యక్షుడు ఉండడంతో ప్రధాన కార్యదర్శి పదవిని రాంభూపాల్‌కు కట్టబెట్టారు. కామారెడ్డి జిల్లాలో ప్రధాన కార్యదర్శులుగా ఇంద్రకరణ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డికి కేటాయించగా వీరు ఒకే నియోజకవర్గానికి చెందిన వారు కావడం గమనార్హం.

**కామారెడ్డిలో విస్మయం...**

కామారెడ్డి జిల్లా కేంద్రంలో హస్తం పార్టీ రాజకీయం రసకందాయంలో పడింది. అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన గడ్డం చంద్రశేఖర్ రెడ్డికి పీసీసీ ప్రధాన కార్యదర్శి పదవి వరించింది. ఈ హఠాత్పరిణామంతో కాంగ్రెస్ వర్గీయుల్లో ఆశ్చర్యం వ్యక్తమవుతున్నది. కామారెడ్డి కాంగ్రెస్‌కు కంచుకోటగా భావించే షబ్బీర్ అలీ వర్గీయులకు మింగుడు పడడం లేదు. మైనార్టీ కోటాలో మంత్రి పదవి ఆశించి భంగపాటుకు గురైన షబ్బీర్ అలీ తాజాగా పీసీసీ పోస్టుల భర్తీతో అవాక్కయ్యారు. ప్రభుత్వ సలహాదారుగా పోస్ట్‌తో కాలం వెళ్లదీస్తున్నప్పటికీ ఉమ్మడి జిల్లాలో సీనియర్ లీడర్‌గా, మైనార్టీ నేతగా మంత్రి పదవిని ఆశించినా ఫలితం లేకుండా పోయింది. భవిష్యత్తులో కామారెడ్డి రాజకీయాల్లో తన వారసుడిని రంగంలోకి దింపాలని కలలు కంటుండగా..షబ్బీర్‌కు పోటీగా కీలక పోస్టుల్లో ఇతర నేతలకు పదవులు వరించడంపై చర్చ జరుగుతోంది. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఇందుప్రియ భర్త గడ్డం చంద్రశేఖర్ రెడ్డికి పీసీసీ జనరల్ సెక్రటరీ పదవి కట్టబెట్టడం వెనుక అధిష్టానానికి వేరే ఉద్దేశాలు ఉన్నట్లుగా పలువురు మాట్లాడుకుంటున్నారు. సరిగ్గా ఏడాదిన్నర క్రితం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న వ్యక్తికి పార్టీ పదవి ఇవ్వడంతో కామారెడ్డి హస్తంలో రచ్చకు దారితీస్తోంది. పార్టీని నమ్ముకుని పని చేస్తున్న వారిని పక్కన పెట్టి నిన్న కాక మొన్న పార్టీలోకి వచ్చిన వారికి పదవులు ఎలా ఇస్తారంటూ మండిపడుతున్నారు. ద్వితీయ శ్రేణి నాయకత్వం తీవ్రస్థాయిలో అసంతృప్తిని వెళ్లగక్కుతున్నది.

**పార్టీ పదవులను అడ్డుకున్నదెవరు...?**

అసంతృప్తితో రగిలిపోతున్న కాంగ్రెస్ శ్రేణులు తాజా పరిణామాల నేపథ్యంలో కీలక నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమా చారం. బోధన్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి రాకపోవడంతో రాజీనామా అస్త్రాలను సంధించినట్లు పార్టీ పదవుల పంపకంలో జరిగిన అన్యాయంపై తీవ్రంగా స్పందించాలని పలువురు యోచిస్తున్నట్లు తెలిసింది. అవసరమైతే పార్టీకి రాజీనామాలు సమర్పించాలని పలువురు భావిస్తున్నట్లు పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. వివిధ కార్పొరేషన్ చైర్మన్ పదవుల భర్తీలో ఒక్కొక్కరికీ రెండేసి పదవులను కట్టబెట్టిన అధిష్టానం.. ఏ పదవి లేని వారిని విస్మరించడం ఏంటంటూ ప్రశ్నిస్తున్నారు. పీసీసీ ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పోస్టుల భర్తీలోనూ సీనియర్లను పట్టించుకోకపోవడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 9 నియోజకవర్గాలుంటే కేవలం కామారెడ్డి, నిజామాబాద్ నియోజకవర్గాల వారికే పదవులు వచ్చినట్లుగా తెలుస్తోంది. మిగిలిన నియోజకవర్గాల్లో ద్వితీయ శ్రేణి నేతలు కొందరు పదవులను ఆశించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోట పీసీసీ రాష్ట్ర స్థాయి పదవులు రాకపోవడానికి ఎవరైనా చక్రం తిప్పారా? అడ్డు పుల్లలు వేశారా? అనే చర్చ జోరుగా సాగుతున్నది.

# కేసీఆర్‌కు నోటీసులు కాంగ్రెస్ కుట్రే

- తెలంగాణ సాధించిన ఉద్యమ యోధుడికి ఇన్ని వేధింపులా ?
- కక్షసాధింపుల రేవంత్‌రెడ్డికి ప్రజాకోర్టులో శిక్ష తప్పదు
- బీఆర్‌ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి



ఖలీల్‌వాడి/నందిపేట, జూన్ 10 : రాజకీయంగా కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ము లేకనే ఎలాంటి లోపాలు లేని కాళేశ్వరం ప్రాజెక్టుపై విషం కక్కుతూ ఆయనకు నోటీసులు జారీ చేయడం కాంగ్రెస్ కుట్రలో భాగమేనని బీఆర్‌ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. చావు నోట్లో తల పెట్టి తెలంగాణ రాష్ట్రం సాధించిన ఉద్యమ యోధుడు కేసీఆర్‌కు ఇన్ని వేధింపులా ? అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను విచారణకు పిలవడాన్ని తెలంగాణ ప్రజలు బ్లాక్‌డేగా పరిగణిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమనేత, అభివృద్ధి సంక్షేమ ప్రదాత కేసీఆర్‌తో పెట్టుకున్నోళ్లు ఎవరైనా మట్టి కొట్టుకుపోతారని హెచ్చరించారు. గద్దెనెక్కిన తొలి రోజు నుంచే కక్ష సాధింపుల పర్వానికి తెరలేపిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజాకోర్టులో శిక్ష తప్పదని పేర్కొన్నారు. తనవి బీజేపీ, టీడీపీ మూలాలని రేవంత్‌రెడ్డే స్వయంగా చెప్పుకున్నారని, ఆయన చదివిన మోదీ, చంద్రబాబు స్కూళ్లకు చీటింగ్ తప్ప రేటింగ్ లేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చి తీరాలని తొడగొట్టిన మొనగాడు అని, కేసీఆర్ అనే మేరు పర్వతాన్నే ఢీకొట్టే దమ్ముందా ? అని మండిపడ్డారు. హామీలను అమలు చేయలేక చేతులెత్తేసిన కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న డైవర్షన్ పాలిటిక్స్ తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. రేవంత్ కుటిలత్వంపై తెలంగాణ ప్రజల్లో ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. కేసులు, విచారణకు భయపడబోమని, ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేసేవరకు పోరాడుతామని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# వాటర్ ట్యాంక్ ఎక్కి నాయకుల హల్‌చల్

బోధన్, జూన్ 10: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించనందుకు నిరసన తెలుపుతూ, వెంటనే ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ పట్టణంలోని బసవతారక్ నగర్‌లో ఉన్న వాటర్ ట్యాంక్‌ను యువజన కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఎక్కి హల్‌చల్ చేశారు. సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వనందుకు తాము నిరసనగా ట్యాంక్ ఎక్కామని, ఇప్పటికైనా ఆయనకు మంత్రి పదవి ఇస్తామని హామీ ఇవ్వకపోతే తాము పైనుంచి కిందికి దూకుతామని పలువురు కాంగ్రెస్ నాయకులకు సెల్‌ఫోన్‌లో హెచ్చరికలు పంపారు. దీనిపై సమా చారం అందుకున్న పోలీసులు వెంటనే వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకుని వారిని కిందికి దిగాల్సిందిగా కోరారు. సుమారు గంట పాటు హల్‌చల్ చేసిన కాంగ్రెస్ యువ నాయకులు పార్టీ సీనియర్ నాయకుడు పాషా మొయినుద్దీన్, మరికొందరి జోక్యంతో తమ ఆందోళనను విర మించుకున్నారు. యువజన కాంగ్రెస్ నాయకుల నిరసనను తాము పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఇతర పెద్దల దృష్టికి తీసుకెళ్లామని, తొందపడవద్దని వారు నచ్చజెప్పారు. ట్యాంక్ ఎక్కిన వారిలో యువజన కాం గ్రెస్ బోధన్ పట్టణ అధ్యక్షుడు తలారి నవీన్ కుమార్, భూమేశ్, అహ్మద్, నజీర్, రాజు తదితరులు ఉన్నారు.



నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని కోటగల్లీలో ఓ ఇంటిపై కూలిన విద్యుత్ స్తంభం



నిజామాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయం గేటుపై కూలిన చెట్టు

# బీభత్సం

- నేలకొరిగిన చెట్లు.. విరిగిన స్తంభాలు
- ఉమ్మడి జిల్లాలో గాలివాన జోరు
- తెగిపడిన విద్యుత్ తీగలు.. అంధకారంలో గ్రామాలు



కొత్తపేటలో ఈదురుగాలులకు ఓ ఇంటిపై నుంచి ఎగిరిపోయిన రేకులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జూన్ 10 : ఉమ్మడి జిల్లాలో సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. బలమైన వీచిన గాలులకు జిల్లా కేంద్రాలతోపాటు పలు మండలాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. మంగళవారం ఉదయం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలో చాలాచోట్ల పెద్ద వృక్షాలు విద్యుత్ తీగల మీద పడడంతో నగరంలో అంధకారం నెలకొన్నది. స్థానిక పూలాంగ్ చౌరస్తా, టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా, వినాయక్‌నగర్, ఖలీల్‌వాడీ, కోటగల్లీ, గౌతంనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరగగా..వాటి కింద నిలిపిన పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. డిచ్‌పల్లి, పొతంగల్, చందూర్, బోధన్, శక్కర్‌నగర్, నవీపేట, బాన్సువాడ, లింగంపేట, ఎల్లారెడ్డి తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. రోడ్లకు అడ్డంగా చెట్లు పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బోధన్ పట్టణంలోని 9వ వార్డులో ఇంటి గోడపై చెట్టు పడిపోయింది. నవీపేట మండలంలోని పలు గ్రామాల్లో 30 విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు ఏఈడీ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. నాళేశ్వర్ జీపీ కార్యాలయంపై చెట్టు పడిపోవడంతో కొంతమేర గోడ ధ్వంసమైనట్లు గ్రామస్తులు తెలిపారు.

**లైన్ ఇన్‌స్పెక్టర్ మృతి**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గాలివాన బీభత్సవానికి భారీ చెట్లు రేకుల షెడ్డుపై కూలిపోవడంతో అక్కడే ఉన్న బోర్గాం విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ దుర్మరణం చెందాడు.



నిజామాబాద్ పూలాంగ్ రైతుబజార్‌లో చెట్టు కూలడంతో ధ్వంసమైన బైక్, కారు



బోధన్ మండలం రాజీవ్‌నగర్‌తండా గ్రామ శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై కూలిన చెట్లు

# వేతనాలు చెల్లించాలని జీపీ కార్మికుల ధర్నా



నవీపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నవీపేట,మే 10: రెండు నెలల బకాయి వేతనాలతోపాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ఎంపీడీవో కార్యలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాయక్‌వాడ్ శ్రీనివాస్ మాట్లాడుతూ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రెండు నెలల బకాయి వేతనాలు చెల్లించక పోవడంతో కార్మికుల కుటుంబ సభ్యులు పస్తులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీకి ఏడాదికి సంతల ద్వారా లక్షల రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ కార్మికులకు వేతనాలు చెల్లించక పోవడం బాధాకరమన్నారు. తక్షణమే కార్మికులకు వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు తమకు వేతనాలతో పాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమండ్ చేస్తూ కార్మికులు ఎంపీడీవో కార్యాలయంలోకి ప్రవేశించి ఎంపీవో రామకృష్ణ, ఎంపీడీవో నాగనాథ్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలోగ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగల్ గంగాధర్ , మండల అధ్యక్షుడు అంజనేయులు , కార్మికులు పాల్గొన్నారు.